క్లుప్తంగా

అంతర్జాతీయ సదస్సుకు జంధ్యాల



శ్రీకాకుళం కల్చరల్: హైదరాబాద్‌లోని ఉస్మానియా విశ్వవిద్యాలయంలో ఈ నెల 25, 26 తేదీల్లో జరగనున్న అంతర్జాతీయ భాషా శాస్త్రవేత్తల సదస్సుకు జిల్లాకు చెందిన రచయిత జంధ్యాల శరత్‌బాబు ఎంపికయ్యారు. నిఘంటువులు పద పట్టిక రూప నిర్మాణం అనే అంశంపై ప్రసంగ వ్యాసం సమర్పిస్తున్నట్లు శరత్‌బాబు బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు.

సంఘాల నిర్వహణపై అవగాహన అవసరం

ఎచ్చెర్ల క్యాంపస్: స్వయం సహాయక సంఘాల నిర్వహణపై క్షేత్రస్థాయిలో అవగాహన కల్పించాలని వెలుగు సంస్థాగత నిర్మాణం డీపీఎం మోహన్‌రావు అన్నారు. ఎచ్చెర్ల సాంకేతిక శిక్షణ కేంద్రంలో వెలుగు సిబ్బందికి రాష్ట్ర పేదరిక నిర్మూలన సంస్థ ఆధ్వర్యంలో నిర్వహించిన మూడు రోజుల శిక్షణ బుధవారంతో ముగిసింది. రుణాలు, చెల్లింపులు తదితర అంశాలపై చర్చించారు. కార్యక్రమంలో ఏపీఎం భాగ్యలత, బాబూరావు పాల్గొన్నారు.

గార మండల బీజేపీ అధ్యక్షురాలిగా లక్ష్మీ జనార్దన్



లక్ష్మీ జనార్దన్‌ను అభినందిస్తున్న జిల్లా అధ్యక్షుడు తేజేశ్వరరావు

గార: మండలం బీజేపీ నూతన అధ్యక్షురాలిగా కె.మత్స్యలేశం మాజీ సర్పంచ్ మైలపల్లి లక్ష్మీజనార్దన్‌ను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు జిల్లా బీజేపీ సహ ఎన్నికల అధికారి చల్లా వెంకటేశ్వరరావు బుధవారం ప్రకటించారు. కె.మత్స్యలేశం (పోర్టు కళింగపట్నం)లో మండల పార్టీ ప్రస్తుత అధ్యక్షుడు ఆరంగి తిరుపతిరావు అధ్యక్షతన జరిగిన ఈ ఎన్నికల్లో పార్టీ జిల్లా అధ్యక్షులు సిరిపురం తేజేశ్వరరావు, ఎన్నికల అధికారి అట్టాడ రవిబాబ్జి, పండి యోగీశ్వరరావు, కెప్టెన్ మైలపల్లి జనార్దనరావు, నీలాపు వెంకటరెడ్డి, అరవల మల్లేశ్వరరావు పాల్గొన్నారు.

ఆకతాయిలకు హెచ్చరిక



కౌన్సిలింగ్ ఇస్తున్న డీఎస్పీ, సీఐలు

శ్రీకాకుళం క్రైమ్ : జిల్లాకేంద్రంలో గంజాయి సేవనం, ఇతర అసాంఘిక కార్యకలాపాలు ఎక్కువగా జరుగుతున్న నేపథ్యంలో అధికారులు ప్రత్యేక దృష్టి సారించారు. మహిళా కళాశాల, ఆర్ట్స్ కళాశాల, ఇతర విద్యాసంస్థల పరిధిలో విద్యార్థినుల పట్ల అసభ్యంగా ప్రవర్తించేవారికి హెచ్చరికగా వరుసగా రెండో రోజు పోలీసులు కౌన్సిలింగ్ నిర్వహించారు. ఆకతాయిలను డీఎస్పీ వివేకానంద స్టేషన్‌కు పిలిపించారు. ఇప్పటికైనా మార్పు చెంది భవిష్యత్తుపై దృష్టిపెట్టాలని, లేదంటే కేసుల్లో బుక్ చేస్తామని హెచ్చరించారు. సీఐలు పైడపునాయుడు, ఈశ్వరరావు, ఎస్ఐలు హరికృష్ణ, సంతోష్ పాల్గొన్నారు.

నేడు పుస్తకావిష్కరణ

శ్రీకాకుళం కల్చరల్: ఆధునిక సమాజంలో సంస్కరణలకు ఆద్యుడిగా పేరొందిన రావు బహదూర్ అన్నెపు పరుశురాం పాత్రో జీవిత చరిత్రను ఉత్తరాంధ్ర, ఒడిశా ప్రాంత ప్రజలకు తెలియజేందుకు గురువారం పుస్తకావిష్కరణ చేస్తున్నట్లు ఆహ్వాన కమిటీ ప్రతినిధి బుడుమురు శ్రీరామమూర్తి ఒక ప్రకటనలో తెలిపారు. కొత్తరోడ్డులోని శాంతి కన్వెన్షన్‌లో కళింగ కల్చరల్ క్లబ్ ఆధ్వర్యంలో జరిగే కార్యక్రమంలో అభిమానులంతా పాల్గొనాలని కోరారు.

ఉపాధి కూలీలకు గరిష్ట వేతనం

ఎచ్చెర్ల క్యాంపస్: మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం పనుల్లో గరిష్ట వేతనం వచ్చేలా మేట్‌లు, వేతనదారులకు అవగాహన కల్పించాలని ఎంపీడీఓ సీపాన హరిహరరావు అన్నారు. ఉపాధి హామీ క్షేత్ర స్థాయి సిబ్బంది, సాంకేతిక సహాయకులకు బుధవారం ఎచ్చెర్ల వెలుగు కార్యాలయంలో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మండలంలో 26 పంచాయతీల్లోనూ పనులు ప్రారంభించాలన్నారు. గరిష్ట వేతనం రూ.300 రోజు వేతనం వచ్చేలా కొలతలపై అవగాహన కల్పించాలని సూచించారు. సమావేశంలో ఇంజినీరింగ్ కన్సల్టెంట్ నారాయణమ్మ, సాంకేతిక సహాయకులు పాల్గొన్నారు.

నేటి నుంచి ఆలయ వార్షికోత్సవాలు

ఎచ్చెర్ల క్యాంపస్ : జాతీయ రహదారికి ఆనుకొని ఉన్న లక్ష్మిడిపేటలో కోదండ రామస్వామి వార్షిక కల్యాణ మహోత్సవ వేడుకలు గురువారం నుంచి ఈ నెల 25 వరకు నిర్వహించనున్నట్లు ఆలయ కమిటీ సభ్యులు ఒక ప్రకటనలో పేర్కొన్నారు. భక్తులంతా పాల్గొని విజయవంతం చేయాలని కోరారు.

కొనసాగుతున్న డ్రోన్ నిఘా

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో చట్ట వ్యతిరేక కార్యకలాపాలను అడ్డుకునే క్రమంలో ఎస్పీ మహేశ్వరరెడ్డి ఆదేశాలతో బుధవారం డ్రోన్ కెమెరాతో నిఘా పెట్టారు. డచ్‌బంగ్లా, కంపోస్టు కాలనీ, దమ్మలవీధి, గుడివీధి, నాగావళి నదీ పరీవాహక ప్రాంతాలు జల్లెడపట్టారు.

బండి..ఇష్టారాజ్యం కుదరదండీ!

- నగరంలో కఠిన నిబంధనలు అమలు చేస్తున్న ట్రాఫిక్ పోలీసులు
- రెండు నెలల్లో 1563 కేసులు.. రూ.3.66 లక్షల చలానా వసూలు



బ్రీత్ ఎనలైజర్‌తో వాహనచోదకులకు టెస్ట్ చేస్తూ..

శ్రీకాకుళం క్రైమ్ : నగరంలో ట్రాఫిక్ నిబంధనలు పాటించని వాహనచోదకులపై పోలీసులు ప్రత్యేక దృష్టి సారించారు. ఏమాత్రం రూల్స్ అతిక్రమించినా చలానాలు విధిస్తూ జరిమానా వసూలు చేస్తున్నారు. ఎస్పీ కె.వి.మహేశ్వరరెడ్డి ఆదేశాల మేరకు ట్రాఫిక్ పోలీసులు కఠిన నిబంధనలతో వాహనదారుల భరతం పట్టి ప్రమాదాలు తగ్గేందుకు కృషిచేస్తున్నారు. ఈ ఏడాది రెండు నెలల్లో 1563 కేసులు కట్టి రూ.3,66,505 లు ఛలానాల రూపంలో జరిమానా విధించారు. ప్రధానంగా తాగి వాహనాలు నడిపేవారినే పోలీసులు టార్గెట్ చేస్తున్నారు. ఫైన్లు విధించడమే కాకుండా 80 శాతంకు పైగా కేసులను కోర్టు కన్విక్షన్లకు పంపడంతో వాహనదారుల్లోనూ మార్పు వస్తోంది. ఈ ఏడాది ఇప్పటివరకు చూసుకుంటే శ్రీకాకుళం నగర పరిధిలో నాలుగు రోడ్డు ప్రమాదాలే చోటు చేసుకున్నాయని, ఇటీవల అమలు చేస్తున్న కొన్నికొన్ని మార్పులు ప్రమాదాలు తగ్గడానికి దోహదపడుతున్నట్లు ట్రాఫిక్ సీఐ నాగరాజు అంటున్నారు.

మార్పులివే..

జిల్లాలో డేంజర్ జోన్లుగా పిలవబడే ఉమెన్స్‌కాలేజీ, ఆర్ట్స్ కళాశాల, డేఅండ్‌నైట్- పాలకొండ రోడ్డు, జీటీ రోడ్డు, ఏడురోడ్లు-పాతబస్టాండ్, ఇలిసిపురం కూడలి రోడ్డుల్లో ట్రాఫిక్ బీట్ వ్యవస్థ పెంచడమే కాకుండా ఎస్ఐ స్థాయి అధికారి ఉంటూ వాహనత నిఖీలు తప్పనిసరిగా చేసేలా ఆదేశాలిచ్చారు. అవసరమున్న చోట స్టాపర్లు, స్పీడ్‌బ్రేకర్లు ఏర్పాటు చేశారు. స్కూళ్లు, కళాశాలలు వదిలే సమయాల్లో నిత్యం రద్దీగా ఉండే ఆర్టీసీ కాంప్లెక్సు-బలగ రోడ్డులో ప్రయివేటు ట్రావెల్స్ బస్సులను దారి మళ్లించడంతో చాలా వరకు ట్రాఫిక్ కట్టడి చేస్తున్నారు. స్పెషల్‌డ్రైవ్‌లో భాగంగా వాహనదారులను ఆపి రికార్డులు లేకపోతే చలానాలు విధిస్తున్నారు. అన్నీ ఉంటే రోడ్డు ప్రమాదాలు, పాటించాల్సిన నియమ నిబంధనలపై అవగాహన కల్పిస్తున్నారు. కళాశాలలు, విద్యాసంస్థల్లో సైతం సదస్సులు నిర్వహిస్తున్నారు.



స్టాపర్స్‌తో ఎస్పీ మహేశ్వరరెడ్డి, డీఎస్పీ వివేకానంద, ట్రాఫిక్ పోలీసులు(ఫైల్)

తాగి నడిపితే..

మద్యం తాగి వాహనాలు నడిపేవారిపై సీఐ ఎం.నాగరాజు ఆధ్వర్యంలోని ట్రాఫిక్ పోలీసులు ప్రత్యేక దృష్టి పెట్టారు. ఈ ఏడాది జనవరిలో ఏకంగా 136 డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేశారు. ఫిబ్రవరిలో ఇప్పటి వరకు 49 చేశారు. వీరిలో 120 మందిని కోర్టులో ప్రవేశపెట్టి జరిమానాలు విధించడమే కాకుండా 24 మంది లైసెన్సులు సైతం రద్దు (సస్పెండ్) చేశారు. లాఅండ్ ఆర్డర్ పోలీసులు సైతం బహిరంగ మద్యం సేవించిన వారికి న్యూసెన్సు కేసులు పెట్టి కోర్టు రిమాండ్‌కు 14 నుంచి 20 రోజులకు పంపిస్తుండటంతో నిబంధనలు పాటించని వాహనదారుల్లో భయం పట్టుకుంది.



ఐదుగురితో పయనిస్తున్న వాహనదారున్ని ఆపుతూ..

ర్యాష్ డ్రైవింగ్‌పైనా..

మితిమీరిన వేగంతో వాహనాలు నడిపేవారిని, లైసెన్సు లేని వారు అందునా మైనర్లు నడిపినా, ట్రిపుల్ రైడ్, నెంబర్‌ప్లేట్లు లేని, సరిగ్గా గుర్తించలేని విధంగా ఉన్న నెంబర్‌ప్లేట్లు లేనివారికి జరిమానా విధిస్తున్నారు. మైనర్ల తల్లిదండ్రులను స్టేషన్లకు పిలిపించి కౌన్సిలింగ్ ఇస్తున్నారు. పరిమితికి మించి ప్రయాణికులను ఎక్కించుకుని వెళ్తున్న ఆటోలు, ట్రక్కులు, ఇతరత్రా వాహనాలపై 125 బీఎన్ఎస్ సెక్షన్ ప్రకారం కేసులు నమోదు చేసి డ్రైవర్లను కోర్టులో ప్రవేశపెడుతున్నారు. ఈ విధంగా ఈ ఏడాది జనవరి నుంచి చూసుకుంటే ఇప్పటివరకు 10 కేసులు నమోదవ్వగా అంతా కోర్టుకు వెళ్లి ఫైన్ కట్టాల్సివచ్చింది.

అవగాహన కల్పిస్తున్నాం..

ద్విచక్రవాహనాలు నడిపే మైనర్ల తల్లిదండ్రులను స్టేషన్‌కు పిలిపించి అవగాహనపరుస్తున్నాం. ఎంవీఐ యాక్ట్ ప్రకారం ఫైన్ చెల్లించాకే వారి వాహనాలను తిరిగిస్తున్నాం. ఎస్పీ ఆదేశాలతో కళాశాలలు విద్యాసంస్థల్లో ప్రమాదాల తీరుపై అవగాహన కల్పిస్తున్నాం. ట్రాఫిక్ సమస్య అధిగమించడానికి 200 ఐరన్ స్టాపర్స్, 20 ఎల్ఈడీ బేటన్స్, 100 రేడియం జాకెట్లు, మాస్కులు కొంతమంది దాతల సౌజన్యంతో ఏర్పాటుచేశాం.

– నాగరాజు, సీఐ, ట్రాఫిక్

విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదుకు..
ఆన్‌లైన్ అడ్డంకులు



గార ఆర్ఎస్‌కే వద్ద సర్వర్ మొరాయించడంతో వేచి ఉన్న రైతులు

- రైతులకు తప్పని పాట్లు
- రోజంతా పడిగాపులు కాయాల్సి వస్తోందని ఆవేదన

గార: రైతులకు పథకాలు అందించేందుకు, ఇతర రాయితీలు వర్తింపజేసేందుకు కేంద్ర ప్రభుత్వం చేపట్టిన విశిష్ట గుర్తింపు సంఖ్య నమోదు ప్రక్రియకు ఆన్‌లైన్ అడ్డంకులు ఎదురవుతున్నాయి. బుధవారం ఉదయం నుంచి గార మండలంలో 24 రైతు సేవా కేంద్రాల పరిధిలో నమోదు ప్రక్రియకు విలేజ్ అగ్రికల్చర్ అసిస్టెంట్‌లు సిద్ధంగానే ఉన్నా, రైతులు ఆర్ఎస్‌కేలు వద్దకు వెళ్లేసరికి సర్వర్ మొరాయించడంతో ఇబ్బందులు తప్పడం లేదు. ఒక పక్క రబీ వ్యవసాయ పనులు, మరో వైపు ఉపాధి పనులు జరుగుతున్న సమయంలో విశిష్ట గుర్తింపు సంఖ్య కోసం రోజంతా ఎదురుచూడాల్సి వస్తోందని రైతులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఈ ఏడాది ఎలాగా రైతు భరోసా ఇవ్వలేదని, అలాంటప్పుడు ఇవన్నీ పెట్టి తిప్పలు పెట్టడం ఎందుకని పలువురు ప్రశ్నిస్తున్నారు. రెవెన్యూ రికార్డుల్లో ఎల్‌పీఎం జాయింట్ ఖాతా ఉన్న వారికి వన్‌బీ రాకపోవడంతో పలువురు రైతులు సతమతమవుతున్నారు. అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ సర్వర్ సమస్యతో మిగిలిన వారు అవస్థలు పడుతున్నారు.

సాంకేతిక సమస్య..

ఆర్ఎస్‌కేలు, వ్యవసాయ కార్యాలయంలో వివరాల నమోదు కోసం రైతులు వచ్చినప్పటికీ ఆన్‌లైన్‌లో సమస్య తలెత్తడంతో ప్రక్రియ ఆగింది. బుధవారం మధ్యాహ్నం రెండు గంటల తర్వాత త్వరితగతిన నమోదు జరిగింది. రైతులు సేవాకేంద్రాల వద్దకు వెళ్లి విశిష్ట సంఖ్య కోసం నమోదు చేసుకోవాలి.

– డి.పద్మావతి, గార మండల వ్యవసాయాధికారి

గురుకుల పాఠశాలకు కుర్చీల వితరణ

శ్రీకాకుళం రూరల్: మండల పరిధిలోని శాస్త్రులపేటలో మహాత్మా జ్యోతిరావు పూలే బాలుర గురుకుల పాఠశాలకు పలువురు దాతలు రూ.12వేల విలువైన కుర్చీలు, ఎల్ఈడీ లైట్లు బుధవారం వితరణ చేశారు. రణస్థలం మండలం గోసాం గ్రామానికి చెందిన విద్యార్థి బాసి చాణిక్య రెడ్డి తండ్రి నాగరాజు విజ్ఞప్తి మేరకు ఆ గ్రామ ప్రభుత్వ ఉద్యోగులు గిన్ని తాతినాయుడు, కంబపు గోవింద, కంబపు శివరామకృష్ణ, కాలపురెడ్డి అప్పలనాయుడు, కొచ్చెర్ల గ్రామానికి చెందిన చుక్క లక్ష్మణరెడ్డి స్పందించి 20 కుర్చీల కొనుగోలుకు ఆర్థిక సాయం అందించారు. ఎల్ఈడీ లైట్లను స్కూల్ కమిటీ చైర్మన్ పిన్నింటి ఎర్రయ్య సమకూర్చారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ అనురాధ, సిబ్బంది పాల్గొన్నారు.



దాతలు సమకూర్చిన కుర్చీలను అందజేస్తున్న స్కూల్ కమిటీ చైర్మన్

భూ సమస్యలపై ప్రత్యేక దృష్టి

ఎచ్చెర్ల క్యాంపస్: భూ సమస్యలపై ప్రత్యేక దృష్టిపెట్టాలని జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్ అన్నారు. ఎచ్చెర్ల తహశీల్దార్ కార్యాలయంలో బుధవారం రెవెన్యూ అధికారులు, సర్వేయర్లు, క్షేత్రస్థాయి సిబ్బందితో సమీక్ష నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మోడల్ గ్రామంగా సర్వే సాగుతున్న జలిపినాయుడుపేటలో పూర్తిస్థాయి సర్వే చేయాలని ఆదేశించారు. గ్రామ రెవిన్యూ సదస్సుల్లో వచ్చిన రైతులు ఫిర్యాదులు సకాలంలో పరిష్కరించాలని చెప్పారు. గ్రామం యూనిట్‌గా భూ సర్వే పక్కాగా జరగాలన్నారు. రైతులకు 1-బీలు, భూ హక్కు ధృవీకరణ పత్రాలు అందజేయాలని సూచించారు. ధ్రువీకరణ పత్రాల జారీలో జాప్యం వహించవద్దన్నారు. వాట్సాప్ గవర్నెన్స్ వంటి సేవలపై ప్రత్యేక దృష్టి పెట్టాలని చెప్పారు. సమావేశంలో తహశీల్దార్ బి.గోపాలరావు, ఆర్ఐ జి.శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.



సమీక్ష నిర్వహిస్తున్న జాయింట్ కలెక్టర్ ఫర్మాన్ అహ్మద్‌ఖాన్

ఘనంగా జేసీఐ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం



ప్రమాణస్వీకారం చేస్తున్న నూతన కార్యవర్గం

శ్రీకాకుళం అర్బన్: సమాజసేవే పరమావధిగా జూనియర్ చాంబర్ ఇంటర్నేషనల్ శ్రీకాకుళం మెయిన్ పనిచేస్తోందని శ్రీకాకుళం ఎమ్మెల్యే గొండు శంకర్ అన్నారు. నగరంలో బుధవారం జేసీఐ శ్రీకాకుళం మెయిన్ నూతన కార్యవర్గ ప్రమాణస్వీకారం వ్యవస్థాపక అధ్యక్షుడు జామి భీమశంకర్ ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ 1986లో ఏర్పడిన జేసీఐ నలభై ఏళ్లుగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తుండటం అభినందనీయమన్నారు. జేసీఐ వ్యవస్థాపకుడు భీమశంకర్ మాట్లాడుతూ సంస్థ ఏర్పాటైనప్పటి నుంచి ఇప్పటి వరకు చేపట్టిన సేవా కార్యక్రమాలను వివరించారు. ముున్ముందు మరింతగా సేవా కార్యక్రమాలు నిర్వహిస్తామని చెప్పారు.

జేసీఐ శ్రీకాకుళం నూతన అధ్యక్షునిగా కూన అనిల్‌కుమార్, కార్యదర్శిగా తమ్మినేని ఉషారాణి, కోశాధికారిగా బొడిగి మధు, ఉపాధ్యక్షులుగా జామి హరీష్, వై.హేమంత్, ఆర్.శ్రీనివాసరావు, జె.కళ్యాణి, టి.మణికంఠ, సంయుక్త కార్యదర్శులుగా కె.జయకృష్ణ, ఐ.లావణ్య, సాయికృష్ణ, డైరెక్టర్‌లుగా జె.కృష్ణకాంత్, స్వాతి, డా.సింధూర, ఎ.సంతోష్, ఎం.పోషక్‌కుమార్, ప్రభాస్‌సూర్య, పీఆర్ మార్కెటింగ్‌గా ఎ.కృష్ణ, పద్మభూషణ్‌సాయి, శివతేజ, ట్రైనింగ్ ఏరియా రాజశేఖర్, జె.మనీష్, కల్చరల్ ఏరియా ఆర్.జగదీష్, డి.నరేంద్ర, మెడికల్ ఏరియా కె.కిరణ్ తదితరులు ఏకగ్రీవంగా ఎన్నికయ్యారు. కార్యక్రమంలో జేసీఐ ప్రతినిధులు ఎ.సంతోష్‌శివకుమార్, వి.పవన్‌కుమార్, చంద్రశేఖర్, బి.వరలక్ష్మి, శివప్రసాద్ పాల్గొన్నారు.

24 నుంచి శివరాత్రి ఉత్సవాలు

శ్రీకాకుళం కల్చరల్: నగరంలోని నక్కవీధిలో ఉమాజఠలేశ్వరస్వామి దేవాలయంలో ఈ నెల 24 నుంచి 28 వరకు శివరాత్రి మహోత్సవాలు జరుగుతాయని ఆలయ వంశపారంపర్య ధర్మకర్త బి.అశ్వినికుమార్, అర్చకులు మహేష్ బుధవారం ఒక ప్రకటనలో తెలిపారు. మార్చి 1న అన్నసమారాధన నిర్వహిస్తామని పేర్కొన్నారు. కొన్నావీధి భీమేశ్వరాలయంలో శివరాత్రి సందర్భంగా ఈ నెల 26న వేకువ జాము నుంచే భక్తుల దర్శనాలు ప్రారంభమవుతాయని ఈఓ మాధవి తెలిపారు. రాత్రి 12గంటల సమయంలో లింగోద్భవ కాలంలో స్వామివారికి అభిషేకాలు జరుగుతాయని పేర్కొన్నారు. బలగ నాగావళి తీరాన ఉన్న బాలాత్రిపుర కాలభైరవ పీఠం దేవాలయంలో ఈ నెల 26న మహా శివరాత్రి వేడుకలు నిర్వహిస్తామని నిర్వాహకులు గణేష్ గురూజీ తెలిపారు. 11 అడుగుల శివలింగాన్ని ఏర్పాటు చేసి లింగోద్భవ కాలంలో వివిధ పుష్పాలు, పండ్లరసాలతో అభిషేకం చేస్తామని పేర్కొన్నారు.



నక్కవీధిలోని ఉమాజఠలేశ్వరుడు

ఆలయ ప్రతిష్టాపనోత్సవాలు ప్రారంభం

ఎచ్చెర్ల క్యాంపస్: అజ్జరాంలో నూతనంగా నిర్మించిన ఉమారామ లింగేశ్వర మృత్యుంజయ మోక్షజ్ఞాన లింగేశ్వర ఆలయ ప్రతిష్టాపనోత్సవాలు బుధవారం ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు కొనసాగనున్న ఈ ఉత్సవాల్లో మొదటి రోజు పూజలు అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. వేద పండితులు భోగాపురపు హరిప్రసాద్ శర్మ ఆధ్వర్యంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు.

హైందవ ధర్మ పరిరక్షకుడు శివాజీ

శ్రీకాకుళం అర్బన్: హైందవ ధర్మ పరిరక్షకుడిగా ఛత్రపతి శివాజీ ప్రతి భారతీయుడి గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయారని గాంధీ మందిర కమిటీ వక్తలు పేర్కొన్నారు. శ్రీకాకుళంలోని గాంధీ మందిరం స్వాతంత్ర సమరయోధులు సంఘసంస్కర్తల స్మృతివనంలో శివాజీ జయంతి వేడుకలు బుధవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా వివిధ రంగాల ప్రముఖులు ప్రతిఒక్కరూ శివాజీని స్ఫూర్తిగా తీసుకోవాలన్నారు. దేశం కోసం ధర్మం కోసం పోరాడిన యోధుడిగా శివాజీ చరిత్రలో నిలిచిపోయారని కొనియాడారు. నాటి పాలకుల దురాగతాలను ఎదిరించి, వెన్ను చూపని వీరుడిగా ఖ్యాతి గాంచారని గుర్తు చేశారు. ప్రపంచానికి హిందూ ధర్మం విశిష్టతను చాటి చెప్పిన మహోన్నతుడని పేర్కొన్నారు.

శ్రీకాకుళం (పీఎన్‌కాలనీ): చరిత్రలో సువర్ణాక్షరాలతో లిఖించబడిన గొప్ప యోధుల పేర్లలో ఛత్రపతి శివాజీ ఒకరని అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ జిల్లా కన్వీనర్ బోర గోపి అన్నారు. మహాత్మా జ్యోతిరావు పూలే పార్కు ఆవరణలో శివాజీ మహారాజ్ జయంతి వేడుకలు నిర్వహించారు. ఈ సందర్భంగా మొగల్ రాజులతో వీరోచితంగా పోరాడి హిందూమతాన్ని కాపాడిన మరాఠా యోధుడు శివాజీ అని కొనియాడారు. కార్యక్రమంలో ఆఫీస్ సెక్రటరీ ఉదయ్‌కిరణ్, వెంకట శతపతి, ప్రవీణ్ ప్రతాప్ తదితరులు పాల్గొన్నారు.



ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురంలో శోభాయాత్ర నిర్వహిస్తున్న యువత

రణస్థలం: ఛత్రపతి శివాజీని ప్రతిఒక్కరూ ఆదర్శంగా తీసుకోవాలని ఆర్ఎస్ఎస్ జిల్లా సంపర్క్ ప్రముఖ్ మేడూరి శేషగిరిరావు పిలుపునిచ్చారు. రణస్థలంలో విశ్వ హిందూ పరిషత్ ఆధ్వర్యంలో శివాజీ జయంతి వేడుకలు నిర్వహించారు. దేశం కోసం పోరాడిన మహోన్నత వ్యక్తుల బాటలో యువత పయనించాలని కోరారు. కార్యక్రమంలో వీహెచ్‌పీ ప్రఖండ ప్రముఖ్ కిల్లారి శేఖర్, ధర్మరక్షక్ సభ్యులు సాయికిరణ్, గౌరినాయుడు, శ్రీను, మురళీకృష్ణ, ఆనంద్, సంతోష్, తిరుమలరావు, జగదీష్ పాల్గొన్నారు.



శ్రీకాకుళం అర్బన్: శివాజీ విగ్రహానికి పూలమాలలు వేసి నివాళులు అర్పిస్తున్న దృశ్యం



రణస్థలం: శివాజీ చిత్రపటానికి పూలమాల వేస్తున్న ఆర్ఎస్ఎస్ సభ్యులు

ఎచ్చెర్ల క్యాంపస్: కుశాలపురంలో బుధవారం విశ్వహిందూ పరిషత్, భజరంగ్ దళ్ ఆధ్వర్యంలో ఛత్రపతి శివాజీ మహారాజ్ శోభాయాత్ర నిర్వహించారు. ప్రధాన వీధిలో జరిగిన ఈ కార్యక్రమంలో శివాజీ గొప్పతనాన్ని స్థానిక విద్యార్థులు, యువత గ్రామస్తులకు వివరించారు.

ఉల్లాసంగా.. ఉత్సాహంగా..



డాక్టర్ బీఆర్ అంబేడ్కర్ విశ్వవిద్యాలయంలోని ఎంసీఏ విభాగం ఆధ్వర్యంలో బుధవారం ఫ్రెషర్స్ డే వేడుకలు ఘనంగా నిర్వహించారు. విద్యార్థులు డ్యాన్సులు, స్కిట్‌లతో అదరగొట్టారు. ఇంజినీరింగ్ ప్రిన్సిపాల్ రాజశేఖర్‌రావు హాజరై విద్యార్థులు లక్ష్యంతో ముందుకు సాగాలని సూచించారు. అసిస్టెంట్ ప్రొఫెసర్లు జి.రామకృష్ణ, ఆర్.శ్రీధర్, పి.రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

– ఎచ్చెర్ల క్యాంపస్

విచ్చలవిడిగా మద్యం విక్రయాలు

- తీర ప్రాంత గ్రామాల్లో అధిక ధరలకు అమ్మకాలు
- స్థానికులను ప్రలోభపెట్టి స్టాక్ పెడుతున్న వైనం



ఇటీవల వత్సవలసలో ఎక్సైజ్ పోలీసులు పట్టుకున్న మద్యం బాటిళ్లు

గార: మండలంలోని తీర ప్రాంతంలో కొద్ది రోజులుగా విచ్చలవిడిగా మద్యం విక్రయాలు జరుగుతున్నాయి. వత్సవలస రాజమ్మ తల్లి జాతర నేపథ్యంలో నేరుగా గ్రామాల్లోకి దుకాణదారులు డెలివరీ చేస్తున్నట్టు స్థానికుల్లో చర్చ నడుస్తోంది. దుకాణ యజమానుదారులు కొందరిని ప్రలోభపెట్టి వాళ్లింటవద్ద స్టాకు ఉంచుతున్నారు. మరో రెండు రోజుల్లో వత్సవలస మూడో వారం జాతర జరగనున్న నేపథ్యంలో ఇప్పటికే చినవత్సవలస, అల్లిగుడ్డి, శ్రీరాంపురం, పేర్లవానిపేట గ్రామాలకు మద్యం డెలివరీ చేసి స్టాకు ఉంచినట్టు సమాచారం. శని, ఆదివారాల్లో రాత్రి అధిక ధరలకు మద్యం అమ్మి సొమ్ము చేసుకునేందుకు పక్కా ప్రణాళిక వేసినట్టు చెబుతున్నారు. రెండో వారంలో ఒక్కో సీసాకు అదనంగా రూ.50 చొప్పున వసూలు చేశారు. ఈ విషయమై 'సాక్షి'లో కథనం రావడంతో తూతూమంత్రంగా ఇద్దరు వ్యక్తుల వద్ద నుంచి 10, 15 మద్యం సీసాలు కలిగినట్టు మాత్రమే కేసు నమోదు జరిగింది. వాస్తవానికి పెద్ద ఎత్తునే స్టాకు ఉందని మత్స్యకార నాయకులు చెబుతున్నారు. పెద్ద మొత్తంలో మద్యం దొరికినా రాజకీయ ఒత్తిళ్ల కారణంగా తక్కువ సీసాలు చూపించినట్టు స్థానికుల్లో చర్చ నడుస్తోంది. వత్సవలస 5 వారాల తర్వాత కొమరవానిపేట, వమరవల్లి ఎల్లమ్మ జాతర జరగనుంది. ఈ నేపథ్యంలో మండలంలోని దుకాణదారులంతా సిండికేట్‌గా మారి మద్యం అధిక ధరలకు అమ్మేందుకు పక్కా ప్రణాళిక వేసినట్టు కొందరు చెబుతున్నారు. ఇప్పటికైనా సంబంధిత అధికారులు స్పందించి బెల్ట్ దుకాణాలను అరికట్టాలని, మద్యం దుకాణాల వద్ద సమయపాలన పాటించేలా చూడాలని పలువురు కోరుతున్నారు.